సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 6 । మే । 2024



జగనన్నకు అండగా నిలవండి
బెంగళూరులో ఉంటున్న పెనుకొండ నియోజకవర్గ వాసులంతా ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా నిలవాలని మంత్రి ఉషశ్రీ చరణ్ కోరారు. 8లో




పట్టు పరిమళం
సిల్క్ టౌన్‌గా పేరుగాంచిన ధర్మవరం అభివృద్ధిలో దూసుకెళ్తోంది. ఫ్యాక్షన్ రక్కసి కాటుకు బలైన నియోజకవర్గంలో శాంతి కుసుమాలు వికసిస్తున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
43.2°/25.6°

జిల్లావ్యాప్తంగా ఆదివారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాల్పుల తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

అరాచక శక్తులు.. కేసుల గుట్టలు

భూముల కబ్జాకోరులు, కరుడుగట్టిన నేరస్తులకు చంద్రబాబు టికెట్లు



ఒకరు భూ కబ్జాకోరు, హత్యా రాజకీయాలకు మారు పేరు.. మరొకరు అవినీతి అక్రమాలకు దేశస్థాయిలో పేరుగాంచిన వారు.. బ్యాంకులకే ఎగనామం పెట్టిన వారు ఇంకొకరైతే, బ్లాక్‌మెయిలింగ్‌కు పేరుగాంచిన మహానుభావుడు మరొకరు.. కుట్రలు, కుతంత్రాలకు మారుపేరైన చంద్రబాబు.. తనకు తగ్గ టీంనే ఈసారి బరిలోకి దించారు. దౌర్జన్యకారులు, ఖూనీకోరులను ఎంపిక చేసి మరీ టికెట్లు కట్టబెట్టారు.



- అనంతపురం టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్‌పై ఏకంగా హత్య కేసు
- 'కదిరి' కందికుంట ప్రసాద్‌పై లెక్కలేనన్ని కేసులు
- బ్లాక్‌మెయిలింగ్, దౌర్జన్యం కేసుల్లో ఎమ్మెస్ రాజు దిట్ట
- జేసీ కుటుంబ కేసుల చరిత్ర వింటే దిమ్మతిరగాల్సిందే

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ టికెట్లు దక్కించుకున్న వారిలో ఎవరి చరిత్ర చూసినా కళ్లు బైర్లు కమ్ముతాయి. వీరిని తలచుకుంటేనే సామాన్యులు బెంబేలెత్తాల్సిన పరిస్థితి. కానీ, వీరంతా టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టిలో సచ్ఛీలురు కావడమే దౌర్భాగ్యం. అడుగడుగునా అడ్డదారుల్లో ముందుకెళ్తూ, ఎదురొచ్చిన వారిని అడ్డు తొలగించుకుంటూ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన చంద్రబాబు టీంలోని వీరు ఒకవేళ కర్మ కొద్దీ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతే జిల్లాలో పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు.

దళితులకు శతగోపం.. హత్యా రాజకీయం..

తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అనంతపురం అర్బన్ టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌పై 2015లో ఏకంగా హత్య కేసు నమోదైంది. వైఎస్సార్ సీపీ నేత ప్రసాద్‌రెడ్డి దారుణ హత్య కేసులో నిందితుడిగా ఉన్నారు. ఇక.. బండమీద పల్లిలో ఓ దళితుడి భూమిని అక్రమంగా లాక్కున్నాడన్న కారణంగా బాధితుడు ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. దీంతో అప్పట్లో దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు వ్యతిరేకంగా దళిత సంఘాల నాయకులు ధర్నాకు దిగడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

డాక్టర్ వద్దంట.. కేసుల వీరుడే ముద్దంట

మడకశిర నియోజకవర్గ సీటును 52 కేసులున్న ఎమ్మెస్ రాజుకు చంద్రబాబు కేటాయించారు. ఉన్నత చదువులు చదివిన డాక్టర్ సునీల్‌కు ముందు టికెట్ ఇచ్చిన బాబు... ఆ తర్వాత ఆయన నుంచి టికెట్ లాక్కుని మరీ నేర చరితుడికి కట్టబెట్టారు. బ్లాక్‌మెయిలింగ్ చేయడం, డబ్బు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడం, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేయడం ఇలా రకరకాల కేసులు ఎమ్మెస్ రాజుపై నమోదై ఉండడం గమనార్హం. శింగనమల, అనంతపురం ప్రాంతాల్లోని స్టేషన్లలో దాదాపు 52 కేసులు ఇతనిపై ఉన్నాయి.

జేసీ చరిత్రంతా నేరాల మయమే..

జేసీ.. ఈ పేరు చెబితే చాలు నేరాలకు కేరాఫ్ అడ్రస్ అన్నట్టుంటుంది. ఫ్యాక్షన్ హత్యలను ప్రోత్సహించి చలి కాచుకున్న జేసీ దివాకర్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డి.. అవినీతి చేయడంలోనూ పేట్రేగిపోయారు. నకిలీ ఇన్‌వాయిస్‌లతో వాహనాల అమ్మకం, అనుమతులు లేకుండా బస్సులు తిప్పడం కేసుల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్‌రెడ్డి జైలుకు కూడా వెళ్లొచ్చారు. దేశస్థాయిలో వీరి ఘనకార్యంపై చర్చ నడిచింది. ఇప్పుడు అలాంటి నేరచరిత్ర కలిగిన అస్మిత్ రెడ్డికే చంద్రబాబు తాడిపత్రి టికెట్ ఇచ్చారు. ఎప్పుడూ తాడిపత్రిలో ఏదో ఒక వివాదం సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య అని అందరికీ తెలిసిందే.

తిట్టి.. టికెట్ కట్టబెట్టి..

గుమ్మనూరు జయరాం మంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు, ఆయన పుత్రరత్నం నారా లోకేష్‌లు జయరాంను తిట్టని తిట్టంటూ లేదు.మట్కా ఆడిస్తారని, పేకాట క్లబ్బులు నడిపిస్తారని, బెంజ్‌కార్లు లంచంగా తీసుకున్నారని ఇలా లెక్కలేనని ఆరోపణలు చేశారు. అయితే, ఎప్పుడైతే ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారో వెంటనే సచ్ఛీలుడై పోయాడు. ఇష్టమొచ్చినట్లు తిట్టిన బాబే ఆయనకు గుంతకల్లు టికెట్ ఇవ్వడంతో స్థానికులే కాదు.. జిల్లా ప్రజానీకమంతా ముక్కున వేలేసుకుంది.

పరిటాలకే ఎందుకో..?

టీడీపీ తరఫున రాప్తాడు ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న పరిటాల సునీత కుటుంబం పేరెత్తితేనే గతంలో ఆ కుటుంబం సాగించిన రక్తచరిత్ర గుర్తుకొస్తుంది. సునీత భర్త పరిటాల రవి అప్పట్లో చేసిన హత్యారాజకీయాల గురించి ఇప్పటికీ జిల్లావ్యాప్తంగా కథలుకథలుగా చెప్పుకుంటారు. ఆర్‌వోసీ పేరుతో కొన్ని వందల మందిని ఊచకోత కోసినట్లు చెబుతారు. దీనికితోడు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన సునీత అవినీతి, అక్రమాలకు లెక్కేలేదు.

కబ్జాల కందికుంట

కదిరి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న కందికుంట వెంకటప్రసాద్‌పై లెక్కలేనన్ని కేసులున్నాయి. కదిరిలో కంటికి కనిపించిన భూములన్నీ కబ్జా చేసేస్తాడనే ఆరోపణలున్నాయి. ఒక రేప్ కేసులో ఈయన నిందితుడిగా ఉన్నట్లు గతంలో ఓ సర్వే సంస్థ వెల్లడించింది. హత్య, హత్యాయత్నం కేసులు ఉన్నాయి. చెక్‌బౌన్స్ కేసులైతే లెక్కలేనన్ని. నకిలీ డీడీల కేసులోనూ నిందితుడిగా ఉన్నారు. ఆ కేసును ఇటీవల కొట్టేయడంతో ఇదే అదనుగా చంద్రబాబు ఆయనకు సీటిచ్చేశారు.

- పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవిత కూడా తక్కువేమీ కాదు. గ్రానైట్, మట్టి, పెట్రోలు కుంభకోణాలకు పాల్పడ్డారని ఈమెపై అనేక కేసులున్నాయి.

ఒక హత్య.. మరో హత్యాయత్నం!

ఎన్నికల నేపథ్యంలో హత్యా రాజకీయాలకు టీడీపీ నాయకులు తెరలేపారు. కొన్ని రోజుల క్రితం అనంతపురం అర్బన్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు గుజ్జల నగేష్‌పై పచ్చ పార్టీకి చెందిన జయరాం నాయుడు వర్గీయులు మారణాయుధాలతో విరుచుకుపడ్డారు. మరోవైపు కదిరి నియోజకవర్గం జౌకుల గ్రామంలో నాగభూషణం అనే యువకుడిని టీడీపీ వర్గీయులు చంపేశారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నేర చరితులకు చంద్రబాబు టికెట్లు కట్టబెట్టడంతోనే ఇలా జరుగుతోందంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. చంద్రబాబు వైఖరి చూస్తుంటే జిల్లాలో మళ్లీ ఫ్యాక్షన్ రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని స్పష్టంగా అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టీడీపీ మూకల దాడిలో గాయపడ్డ గుజ్జల నగేష్ (ఫైల్)

న్యూస్‌రీల్

డ్యూటీ ఆర్డర్ చూపితే పోస్టల్ బ్యాలెట్

- జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఇప్పటికే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఓటరు జాబితాలో పేర్లు లేనివారు, ఓటు కోసం దరఖాస్తు చేసుకోని వారు ఇంకా ఎవరైనా ఉంటే ఎన్నికల డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డును చూపి పోస్టల్ బ్యాలెట్ పొందవచ్చన్నారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గంలోనూ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 7న ఓపీఓలకు, అత్యవసర సర్వీసుల వారికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని 1,301 మంది పోలీస్ సిబ్బంది ఓటు వేయడానికి ఈనెల 7, 8, 9 తేదీల్లో అవకాశం ఇస్తామన్నారు. 12డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు పుట్టపర్తిలోని ఎస్పీ కార్యాలయంలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ కేంద్రం 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పనిచేస్తుందన్నారు. ఇతర శాఖలకు సంబంధించి ఎసెన్షియల్ సర్వీసెస్ ఉద్యోగులు 571 మంది ఉన్నారని, వారంతా పుట్టపర్తి గణేష్ కూడలిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో 8వ తేదీ (ఒక్క రోజు మాత్రమే) ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఓటు వేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న మీడియా ప్రతినిధులు సైతం ఇదే కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'పచ్చ'మృగం పైశాచికత్వం

- దివ్యాంగురాలైన బీసీ యువతిపై లైంగిక దాడి
- గర్భం దాల్చిన బాధితురాలు
- బాధిత యువతి కుటుంబానికి పచ్చ నేతల బెదిరింపులు



పుట్టపర్తి: అభాగ్యురాలు, అందులోనూ దివ్యాంగురాలు..ఎవరైనా సానుభూతి చూపుతారు. వీలైతే సాయం చేస్తారు. కానీ కామంతో కళ్లుమూసుకుపోయిన ఓ టీడీపీ నేత ఆ యువతిపై కన్నేశాడు. కామంతో కాటువేసి గర్భవతిని చేశాడు. ఈ ఘటన ఆదివారం కొత్త చెరువు మండలంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే... కొత్తచెరువు మండలం భైరాపురం గ్రామం బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ యువతికి పుట్టుకతోనే రేచీకటి. దీంతో పెళ్లిసంబంధాలు కుదరలేదు. అవివాహితురాలైన ఆమెపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కన్నేశాడు. మాయ మాటలు చెప్పి లైంగికదాడి చేశాడు. దీంతో ఆమె గర్భం దాల్చింది. అయితే ఆ విషయం కూడా ఆమె గుర్తించలేదు. రోజురోజుకూ కడుపు పెరుగుతుండగా...గడ్డ ఉందేమోనని అనుకుంది. ఇటీవల అనారోగ్యం బారిన పడగా, కుటుంబీకులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. యువతిని పరీక్షించిన వైద్యులు ఆమె ఏడు నెలల గర్భంతో ఉన్నట్లు తెలిపారు. దీంతో బాధితురాలు, ఆమె కుటుంబీకులు ఏం చేయాలో తెలియని పరిస్థితిలో న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. అయితే సదరు టీడీపీ నాయకుడు బాధిత కుటుంబాన్ని బెదిరించాడు. అబార్షన్ చేయిస్తానని, ఎవరికైనా చెబితే చంపేస్తా అంటూ బెదిరిస్తున్నట్లు సమాచారం. మరోవైపు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొందరు దుప్పటి పంచాయితీ చేస్తూ... నిందితునికి అండగా నిలుస్తున్నారు. దీంతో బాధిత కుటుంబం న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. నిరుపేదరాలైన ఓ యువతికి అన్యాయం చేసేందుకు సిద్ధపడిన టీడీపీ నేతలపై మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీసీలకు అండ.. వైఎస్సార్‌సీపీ జెండా





ప్రసంగిస్తున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్, హాజరైన బీసీలు

- బీసీలంతా జగన్‌కు బాసటగా నిలవాలి
- ఫ్యాను గుర్తుకే ఓటేద్దాం.. జగన్‌కు జై కొడదాం
- 'జయహో బీసీ' సభలో హోరెత్తిన జగన్నినాదం

కదిరి: బీసీలకు ఏ నాయకుడు ఇవ్వనంత ప్రాధాన్యం ఇచ్చి పాలనలో భాగస్వామ్యం చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో బీసీలంతా మద్దతుగా నిలవాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీలకు అండ... వైఎస్సార్ సీపీ జెండానే అన్నారు. ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక దత్తా ఫంక్షన్ హాలులో బీసీ నేత నరసింహగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశం గ్రాండ్ సక్సెస్ అయింది. బీసీలు పెద్ద సంఖ్యలో హాజరుకాగా, కదిరి పట్టణం వైఎస్సార్ సీపీ జెండాలతో రెపరెప లాడింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..మన పిల్లల భవిష్యత్ కోసం బీసీలంతా ఈసారి ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపు నిచ్చారు. జగన్‌ను ఓడించేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఏకమయ్యాయన్నారు. కానీ జగన్ వెంట పేదలంతా ఉన్నారని, ఆయనకు దేవుడి దీవెనలు, ప్రజల ఆశీర్వాదాలు మెండుగా ఉన్నాయన్నారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో జగన్ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెడుతుంటే చంద్రబాబుతో పాటు ఆయనకు వత్తాసు పలికే ఇంకొందరు, ఎల్లో మీడియా అడ్డుకోవాలని చూసిందని ఆర్.కృష్ణయ్య గుర్తు చేశారు. బీసీలకు తెలివితేటలు లేవు..బీసీలు జడ్జిలుగా పనికిరారు అని లేఖలు రాసిన వారు.. ఇప్పుడు మళ్లీ ఓట్ల కోసం బీసీల దగ్గరకు వస్తున్నారని, వారికి ఓటు ద్వారానే తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు.

అన్నింటా బీసీలకు సగభాగం..

రాష్ట్ర బడ్జెట్‌లోనూ, రాజకీయాల్లోనూ అలాగే విద్యలో ఇలా ప్రతి దాంట్లో బీసీలకు 50 శాతం వాటా ఇచ్చి చేతల్లో చూపించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఆర్.కృష్ణయ్య అన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం బీసీలకు ఇస్త్రీ పెట్టెలు, కత్తెర పెట్టెలు తాయిలాలుగా ఇస్తే బీసీల ఆత్మబంధువు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రం బీసీలను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి తెచ్చేందుకు కృషి చేశారని ఆయన కొనియాడారు.

వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ..

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.హరిప్రసాద్ మాట్లాడుతూ.. చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటే, జగన్ బీసీలకు పదవులిచ్చి పక్కన కూర్చోబెట్టుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించిన నాయీబ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానని చంద్రబాబు బెదిరించారని వారు గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్లలో చంద్రబాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదని, కానీ జగనన్న మాత్రం ఎంతో మంది బీసీలను రాజ్యసభకు పంపారని అన్నారు. వైఎస్సార్ సీపీ కదిరి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, బీసీ సబ్‌ప్లాన్ కింద ఏడాదికి రూ.10 వేల కోట్లు చొప్పున ఇస్తానని చెప్పి చంద్రబాబు దగా చేస్తే, సీఎం జగనన్న ఏడాదికి రూ.15 వేల కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా మాట్లాడుతూ, బీసీలకు వైఎస్సార్ సీపీలోనే తగిన గుర్తింపు ఉందన్నారు. ఎస్కేయూ పాలక మండలి సభ్యుడు కొమ్ము భాస్కర్ మాట్లాడుతూ, ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?అని చంద్రబాబు దళితుల పుట్టుకనే అవహేళన చేశారన్నారు. దీంతో సభలో ఉన్న వారంతా 'బాయ్ బాయ్ బాబు' అని గట్టిగా అరిచారు.

మద్దతు ఇవ్వండి

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ మాట్లాడుతూ, బీసీల సంక్షేమం కోరే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బీసీలంతా వెన్నుదన్నుగా నిలవాలన్నారు. బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన తమకు సీఎం జగన్ టికెట్లు ఇచ్చారని, మద్దతుగా నిలిచి గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర బీసీ నాయకులు దశరథనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి వేమల ఫయాజ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లోకేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రాఘవయ్య, రామయ్య, రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్, పెద్ద సంఖ్యలో బీసీలు పాల్గొన్నారు.

దమ్ముంటే చేనేతకు జీఎస్టీ రద్దు చేయించు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- పోలింగ్ రోజులోపు ప్రకటన చేయిస్తే ఎన్నికలు వదిలేస్తా
- ఎన్డీఏ అభ్యర్థి సత్యకుమార్‌కు ఎమ్మెల్యే కేతిరెడ్డి సవాల్

ధర్మవరం: ''ఢిల్లీ స్థాయి నాయకుడినని గొప్పలు చెప్పుకునే నువ్వు.. కార్పొరేట్ తరహాలో ధర్మవరంలో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నావు.. ఓట్ల కోసం అసత్యాలు ప్రచారం చేస్తున్నావు.. ప్రచారానికి ఏకంగా కేంద్ర హోం మంత్రిని తీసుకువచ్చావ్.. నిజంగా చేనేతలపై నీకు ప్రేమ ఉంటే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చేనేతకు జీఎస్టీ పన్ను రద్దు చేయించు. పోలింగ్ రోజు లోపు జీఎస్టీ రద్దు ప్రకటన చేయిస్తే నేను ఎన్నికలు వదిలేసి ఇంట్లో కూర్చుంటా'' అని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌కు సవాల్ విసిరారు. ఆదివారం ఆయన ధర్మవరంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ బీసీకార్డుతో చేస్తున్న మోసాలను, జాతీయ నాయకుడినంటూ చేస్తున్న పబ్లిసిటి స్టంట్‌పై మండిపడ్డారు. యాదవ సామాజికవర్గం అంటూ చెప్పుకుంటున్న సత్యకుమార్ అసలు బీసీనే కాదని, అతను ఆర్యక్షత్రియుడన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. ప్రజలకు ఏం మంచి చేస్తారో చెప్పి ఓట్లు అడగాలే తప్ప, అసత్యాలు, గొప్పలు చెప్పడం ఏ స్థాయి రాజకీయమో సత్యకుమారే చెప్పాలన్నారు. ఎంత ప్రలోభపెట్టినా స్థానికంగా ఎవరూ సహకరించకపోవడంతో సత్యకుమార్ ఇతర రాష్ట్రాల నుంచి వందల మందిని ధర్మవరానికి తీసుకువచ్చి ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. అలాగే 30 మందికిపైగా ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేలను ప్రచారానికి తీసుకువచ్చారన్నారు. కానీ వారు ఎక్కడివారో.. ఏం చేస్తారో ధర్మవరం వాసులకు తెలియదన్నారు. అందువల్లే సత్యకుమార్ ప్రచారానికి ఎక్కడా ప్రజా స్పందన లభించడం లేదన్నారు. దీంతో అతను ఏకంగా సినిమా హీరోయిన్లను ధర్మవరానికి తీసుకువస్తున్నారన్నారు. అయినా జనం పట్టించుకోకపోవడంతో రోజుకో డ్రామా ఆడుతున్నారన్నారు. అయినా జనం నమ్మే పరిస్థితి లేదన్నారు. చేనేతపై జీఎస్టీ పన్ను 5 శాతం ఉండగా, గతంలో ఎన్డీఏ ప్రభుత్వం 12 శాతానికి పెంచాలని చూస్తే తాను పోరాటం చేశానన్నారు. తమ పార్టీ ఎంపీలతో కలసి ఢిల్లీ వెళ్లి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కలిసి చేనేతల పరిస్థితి వివరించి జీఎస్టీ పెంచవద్దని కోరగా, ఆమె సానుకూలంగా స్పందించి జీఎస్టీ పన్ను పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారన్నారు. ఈవిషయం ధర్మవరం వాసులందరికీ తెలుసన్నారు. ఇప్పటికైనా సత్యకుమార్ అసత్యాలు మానుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి హితవు పలికారు.

అపూర్వ ఆదరణ

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలే ఎదురెళ్లి ఘన స్వాగతం పలుకుతున్నారు. జననేత జగన్‌ను మళ్లీ సీఎం చేస్తామంటూ హామీ ఇస్తున్నారు.– సాక్షి నెట్‌వర్క్



అపూర్వ స్వాగతం: రొళ్ల మండలం జీబీహళ్లిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఈరలక్కప్పకు హారతిపట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు



అక్కా నమస్తే: ధర్మవరం మండలం రావులచెరువులో మహిళలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



అవ్వా బాగున్నావా: హిందూపురం 23వ వార్డులో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక



జగన్ సైన్యం: పార్టీ శ్రేణులతో కలిసి పుట్టపర్తి 7వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

క్లుప్తంగా

ఎన్నికల ప్రచారంలో బీపీఎం


వెంకటాపురంలో పరిటాల సునీత సమక్షంలో ఓటరు జాబితాతో నిల్చొన్న బీపీఎం పవన్‌రాజ్

సాక్షి, పుట్టపర్తి: రామగిరి మండలం పేరూరు బ్రాంచ్ పోస్టుమాస్టర్ (బీపీఎం)గా పనిచేస్తున్న పవన్‌రాజ్ టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఏడుగురాకులపల్లి గ్రామానికి చెందిన ఆయన గత వారంలో పరిటాల సునీతతో కలసి స్వగ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సునీత స్వగ్రామం వెంకటాపురంలో నిర్వహించే టీడీపీ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి రాజకీయ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించడాన్ని పలువురు తప్పుబట్టారు.

పునాదిలో మహిళ మృతదేహం

- భర్తనే హత్య చేసి పాతిపెట్టినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు


హతురాలిని పూడ్చిన స్థలం

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ నేరళకుంటి గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. భార్యను భర్తనే హతమార్చి ఇంటి పునాదిలో పాతిపెట్టాడు. వివరాలు.. నేరళకుంటి గ్రామ దళిత వాడకు చెందిన కార్తీక్‌కు కొన్నేళ్ల క్రితం శివమొగ్గకు చెందిన జ్యోతి (30)తో వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం రాత్రి జ్యోతిని భర్త హతమార్చి గుట్టు చప్పుడు కాకుండా ఇంటి ఎదుట ఉన్న పునాదిలో పాతి పెట్టాడు. అయిదే ఆదివారం ఉదయం వీధిలో సంచరిస్తున్న వారికి ఇసుకలో పాతిపెట్టిన మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పునాదిలోని ఇసుకను కాస్త తొలగించి చూస్తే జ్యోతి మృతదేహం కనిపించింది. ప్రాథమిక విచారణలో ఈ ఘాతుకానికి ఒడిగట్టింది భర్తనేనని తేలింది. అయితే మృతదేహాన్ని వెలికి తీసేందుకు స్థానిక మేజిస్ట్రేట్ అనుమతి కావాల్సి ఉండడంతో సోమవారానికి వాయిదా వేశారు. సీఐ సురేష్, ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది అక్కడే ఉండిపోయారు.

పట్టు పరిమళం

నియోజకవర్గ ధర్మవరం ముఖచిత్రం

ధర్మవరానికి అంతర్జాతీయ ఖ్యాతి
- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రగతి పరుగులు
- రూ.5,677 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు రూ.3024 కోట్ల లబ్ధి
- 93శాతం కుటుంబాలకు జగనన్న ప్రభుత్వంలో చేకూరిన మేలు





నియోజకవర్గం : ధర్మవరం

మొత్తం ఓట్లు	: 2,45,758
పురుషులు	: 1,21,764
మహిళలు	: 1,23,974
ఇతరులు	: 20

ధర్మవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు వివిధ పథకాలతో లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
వైఎస్సార్ పింఛన్ కానుక	58,000	రూ.537కోట్లు
జగనన్న అమ్మ ఒడి	35,000	రూ.187కోట్లు
వైఎస్సార్ చేయూత	26,000	రూ.103కోట్లు
వైఎస్సార్ ఆసరా	40,000(సంఘాలు)	రూ.146కోట్లు
వైఎస్సార్ రైతు భరోసా	1,06,000	రూ.370కోట్లు
ఇంటి నిర్మాణానికి(నేరుగా చెల్లింపు)	17,000	రూ.1062కోట్లు
జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన	25,000	రూ.117 కోట్లు
వైఎస్సార్ నేతన్న నేస్తం	17,000	రూ.135కోట్లు
వైఎస్సార్ బీమా	547	రూ.8.7కోట్లు
వైఎస్సార్ వాహనమిత్ర	1200	రూ.3.3కోట్లు
ఇతర పథకాలు		
జగనన్న చేదోడు	8,000	రూ.14 కోట్లు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	19,000	రూ.137 కోట్లు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	5,000	రూ.9.7 కోట్లు

ధర్మవరం: 'సిల్క్ టౌన్ ఆఫ్ అనంత'గా ఖ్యాతిగాంచిన ధర్మవరంలో ఏ వీధికి వెళ్లినా పట్టు పరిమళాలు వెదజల్లుతుంటాయి. ప్రతి ఇంట్లోనూ మగ్గాలు కానీ, చేనేత అనుబంధ రంగాలకు సంబంధించిన పనులు జరుగుతుంటాయి. ఇక్కడి పట్టు ఉత్పత్తులు దేశవిదేశాలకు ఎగుమతి అవుతుంటాయి.

ఒకరి తర్వాత ఒకరు విజయం

ధర్మవరం నియోజకవర్గ ప్రజలు ఎన్నికల్లో విలక్షణం చూపుతుంటారు. ఎప్పుడూ ఒక పార్టీకి పట్టం కట్టకపోవడంతో పలుమార్లు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. 1952లో జరిగిన మొదటి ఎన్నికల్లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ (కేఎంపీపీ) అభ్యర్థి శ్రీనివాసులు కాశెట్టి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1955లో కాంగ్రెస్ అభ్యర్థి పప్పూరు రామాచార్యులు, 1962లో కాంగ్రెస్ అభ్యర్థి పి.వెంకటేశ్వర చౌదరి, 1967లో స్వతంత్ర అభ్యర్థి పి.వెంకటేశం గెలిచారు. 1972లో కాంగ్రెస్ పి.వెంకటేశ్వర చౌదరి, 1978లో కాంగ్రెస్ అభ్యర్థి గోనుగుంట్ల అనంతరెడ్డి విజయం సాధించారు. 1983, 1985, 1989లో టీడీపీ తరఫున గరుడమ్మగారి నాగిరెడ్డి గెలుపొందారు. 1994లో టీడీపీ తరఫున గుత్తా వెంకటనాయుడు, 1999లో స్వతంత్ర అభ్యర్థిగా కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి ఎన్నికయ్యారు. 2004లో టీడీపీ తరఫున గోనుగుంట్ల జయలక్ష్మమ్మ గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ తరఫున కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గెలిచారు. 2014లో టీడీపీ తరఫున గోనుగుంట్ల సూర్యనారాయణ ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో వైఎస్సార్‌సీపీ తరఫున కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గెలుపొందారు.

మారిన చేనేత బతుకులు

ఒకప్పుడు ధర్మవరం ప్రాంతంలో 1.5 లక్షల మగ్గాలు ఉండగా... ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 5 లక్షల మంది ఉపాధి పొందేవారు. గత ప్రభుత్వాల వైఖరి కారణంగా ముడిసరుకుల ధరలు పెరగడం, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభ్యం కాకపోవడంతో చాలా మంది చేనేత వృత్తికి దూరమవుతూ వచ్చారు. ఈ క్రమంలోనే వలసలూ పెరిగాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. కుదేలైన చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నేతన్న నేస్తం పేరుతో ఈ ఐదేళ్లలో ఏకంగా రూ.135 కోట్లను నేరుగా చేనేత కార్మికుల బ్యాంక్ ఖాతాల్లోకి బదలాయించారు. దీంతో చేనేత పరిశ్రమ క్రమంగా గాడిలో పడింది.

విరబూసిన శాంతికుసుమాలు

సీమ ఫ్యాక్షన్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపిన ధర్మవరంలో ఒక్కప్పుడు విచ్చుకత్తులు స్వైర విహారం చేశాయి. టీడీపీ నేతల అధికార దాహానికి నెత్తుటియేరులు పారాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ధర్మవరం ప్రాంతంలో శాంతి కుసుమాలు విరబూశాయి. ఫ్యాక్షన్ వీడి ప్రజలు శాంతియుత జీవనానికి అలవాటుపడ్డారు. వ్యవసాయం, చేనేత రంగాలు మళ్లీ పుంజుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు.. తర్వాత అంటూ గొప్పగా చెప్పుకునేలా ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకెళ్లింది. సాగు, తాగునీటి సమస్యలు తీరాయి. 80 శాతానికి పైగా గ్రామాలకు పక్కా రహదారులు ఏర్పాటయ్యాయి. జగన్ సర్కార్ సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.

ధర్మవరం బరిలో 15 మంది అభ్యర్థులు


వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం నియోజకవర్గ ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు నిలిచారు. వైఎస్సార్‌సీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, బీజేపీ తరఫున సత్యకుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా రంగన అశ్వత్థనారాయణ, బీఎస్పీ అభ్యర్థిగా సాకే వినయ్‌కుమార్, జైభీమ్ రావు భారత్‌పార్టీ తరఫున దారా శంకర్, నవతరం పార్టీ అభ్యర్థిగా షేక్ ఆయాజ్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా ఇలియాజ్ అహమ్మద్ సయ్యద్, ఈశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, కవిత, ధనుంజయ, బిల్లే నరేంద్ర, బీరే సోమశేఖర్, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులునాయక్ ఉన్నారు.

అభివృద్ధి పథంలో నియోజకవర్గం

- ధర్మవరం పట్టణంలో రూ.108కోట్లతో కదిరి రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఆర్‌అండ్‌బీ వర్క్ పనులు, బ్రిడ్జి నిర్మాణంలో స్థలంతోపాటు ఇళ్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారంగా రూ.30కోట్లు చెల్లించారు.
- నియోజకవర్గంలోని తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ, ధర్మవరం మండలాల్లోని రైతులకు రూ.75.15 కోట్ల విలువైన 4,175 ఎకరాల భూమిని పంపిణీ చేశారు.
- ధర్మవరం మండలం చిగిచెర్ల వద్ద రూ.72కోట్లతో వేరుశనగ విత్తన శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. విత్తన శుద్ధి కేంద్రం వల్ల ధర్మవరం పరిసర ప్రాంతాల్లో పండే వేరుశనగ పంటకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది.
- మన బడి నాడు–నేడు పథకం కింద రూ.22.53కోట్లతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తూ టాయిలెట్లు నిర్మాణం, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లతో విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థుల కోసం ఫర్నిచర్, పాఠశాలకు పెయింటింగ్, స్కూళ్ల మరమ్మతులు, ఆకుపచ్చ సుద్ద బోర్డులు, పాఠశాలల కాంపౌండ్ గోడల నిర్మాణం చేశారు.
- ధర్మవరం పట్టణంలో రూ.15.90కోట్ల నిధులతో అత్యాధునిక వసతులతో కూడిన 100 పడకల తల్లీబిడ్డ ఆస్పత్రి, యర్రగుంట సర్కిల్, సిద్ధయ్యగుట్ట, శాంతినగర్‌లలో రూ.3.30 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించారు.
- ధర్మవరంలో రూ.11కోట్లతో మార్కెట్‌యార్డు గోడౌన్లు, రూ.7.50కోట్లతో కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి కూరగాయల మార్కెట్ భవనాల కాంప్లెక్స్ నిర్మించారు.
- ధర్మవరంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ముదిగుబ్బలో పోలీస్‌స్టేషన్, ఆర్‌టీఓ కార్యాలయం ఏర్పాటు చేశారు.

నియోజకవర్గ ప్రత్యేకతలు...

- ధర్మవరం ప్రాంతానికి ప్రపంచస్థాయిలో పేరుంది. పట్టుచీరలు నాణ్యతగా తయారు చేయడం ఇక్కడి ప్రత్యేకత. దారం మొదలు చీర పూర్తిగా తయారయ్యే వరకు వివిధ రకాల పనులను ఇక్కడ చేనేత కార్మికులే సొంతంగా చేస్తుంటారు. అందుకే ధర్మవరం పట్టుచీరలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది.
- నియోజకవర్గంలోని తాడిమర్రి మండలంలో కాకి ముట్టని క్షేత్రం కాటికోటేశ్వర క్షేత్రం ఉంది. ఆలయ సమీపంలో కాకులు తిరగవు. కొండల మధ్యలో ఉన్న కాటికోటేశ్వర క్షేత్రంలో ఏటా ఎంతో పవిత్రంగా ప్రత్యేక పూజలు చేస్తారు. లక్షలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు హాజరవుతారు.
- తాడిమర్రి మండలంలో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) చూసేందుకు ప్రజలు ఎప్పుడూ వస్తుంటారు. చివరికి ఈ నియోజకవర్గంలోనే పర్యాటక కేంద్రంగా ఈ రిజర్వాయర్ మారింది.
- ముదిగుబ్బ మండలంలో జిల్లేడుబండ రిజర్వాయర్ చూసేందుకు ప్రజలు తరలివస్తుంటారు. రిజర్వాయర్ నుంచి కనిపించే ప్రకృతి అందాలను చూసేందుకు ప్రజలు ఇక్కడకు విచ్చేస్తుంటారు.

ప్రమాదంలో యువకుడి మృతి


వినీత్ (ఫైల్)

లేపాక్షి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం బయన్నపల్లికి చెందిన వినీత్ (22) ఇంట్లో ఆదివారం పుణ్యతిథి కార్యక్రమం ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు లేపాక్షిలో వేచి ఉన్న కొందూరు నుంచి వచ్చిన బంధువులను పిలచుకుని వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ఇద్దరు మహిళలను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళుతుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి ముగ్గురూ కిందపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వినీత్‌ను బెంగళూరుకు తీసుకెళుతుండగా కర్ణాటకలోని గౌరిబిదనూరు సమీపంలోకి చేరుకోగానే మృతి చెందాడు. గాయపడిన ఇద్దరు మహిళలు హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల పరిశీలకుడి రాక


దీపక్ మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లాకు కేటాయించిన సాధారణ ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు దీపక్ మిశ్రా (విశ్రాంత ఐపీఎస్) ఆదివారం ఉదయం పుట్టపర్తికి చేరుకున్నారు. ఆయనకు ప్రశాంతి నిలయంలో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పటిష్ట నిఘా


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

- రూ.45.95 లక్షల విలువైన మద్యం స్వాధీనం

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో నిఘా పటిష్టం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు తెలిపారు. జిల్లాలో మద్యం అక్రమ రవాణాపై ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌ఓ కొండయ్యతో కలసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, సెబ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలపై ఆరా తీశారు. జిల్లాలో 8 సబ్ డివిజన్ల పరిధిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఇప్పటి వరకూ కొడికొండ, తూముకుంట చెక్ పోస్టుల్లో 18 కేసులు నమోదైనట్లుగా తెలిపారు. ఆయా కేసుల్లో 17 మందిని అరెస్ట్ చేసి, నాలుగు వాహనాలు, 97.76 లీటర్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సరిహద్దు చెక్ పోస్టుల్లో నిఘా మరింత పెంచి మద్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు. సెబ్ విభాగం ద్వారా ధర్మవరం, సీకేపల్లి, పెనుకొండ, పుట్టపర్తి, హిందూపురం, కదిరి, తనకల్లు, మడకశిర ప్రాంతాల్లో 385 మందిని బైండోవర్ చేసి 6,334 లీటర్ల నాటుసారా, 3,529 లీటర్ల కర్ణాటక మద్యం, 324 లీటర్ల ఆంధ్రా లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.45,97,705గా నిర్ధారించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రోజువారీ విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. బల్క్ సేల్స్‌ను గుర్తించి నివేదికలు అందించాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ బాలకృష్ణన్, సెబ్ ఈడీ సుబ్రహ్మణ్యం, సెబ్ సీఐలు కన్నయ్య, మోహన్‌రెడ్డి, జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ లలితాదేవి, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణను అడ్డుకుంటాం

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు



మాట్లాడుతున్న పెన్నోబులేసు

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మార్పీఎస్ మంద కృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే ఆయన పర్యటను ఎక్కడ పడితే అక్కడ అడ్డుకుంటామని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు హెచ్చరించారు. ఆదివారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణ చేసిన ఆరోపణలను ఖండించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వాకంతోనే మాదిగలపై వివక్ష పెరిగిందన్నారు. మాదిగల ఎదుగుదల ఇష్టం లేని చంద్రబాబుకు మందకృష్ణ వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. వాస్తవానికి దళితులను బిచ్చగాళ్లుగా చూసింది చంద్రబాబేనన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దళితులకు అన్ని విధాల న్యాయం చేకూరిందన్నారు. ఇప్పటికైనా మందకృష్ణ మాదిగ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

జగనన్నకు అండగా నిలవండి


మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్


బెంగళూరులో జరిగిన ఆత్మీయ సదస్సులో పాల్గొన్న పెనుకొండ ప్రాంత వాసులు

- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించండి
- మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: బెంగళూరులో నివాసం ఉంటున్న పెనుకొండ నియోజకవర్గ వాసులందరూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖామంత్రి , వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. బెంగళూరులోని హొంగసంద్రలో ఉన్న ఏసీఆర్ కన్వెన్షన్ హాల్ వేదికగా ఆదివారం రాత్రి బెంగళూరులో స్థిరపడిన పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, పరిగి, గోరంట్ల మండలాలకు చెందిన వారితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల కింద అనేక సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో అందించి వారి అభ్యున్నతికి సహకారం అందించారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించి ప్రతి పేద కుటుంబానికి పెద్ద కొడుకుగా అండగా నిలిచారన్నారు. ఏకంగా రూ.2.70 లక్షల కోట్లను పేద ప్రజల ఖాతాల్లోకి నేరుగా వేసిన ఏకైక సీఎం జగనన్నే అన్నారు. ఇలాంటి గొప్ప నాయకుడిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. పెనుకొండలో మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్లు మంజూరు చేసి, వేగంగా నిర్మాణాలను పూర్తి చేయిస్తున్నారన్నారు. ఇది పూర్తయితే అత్యాధునిక వైద్యసేవలు ఆ ప్రాంత ప్రజలకు స్థానికంగానే లభిస్తాయని చెప్పారు. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు తరలివచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, నాయకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


గొర్రె పిల్లల కళేబరాలను పరిశీలిస్తున్న డాక్టర్ రామాంజనేయులు

పావగడ: తాలూకాలోని రొప్పం గ్రామ పంచాయతీ బొమ్మతనహళ్లి గ్రామంలో రైతు బసయ్యకు చెందిన గొర్రెలపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఆదివారం తనకున్న వంద గొర్రెల్లో 25 పిల్లలను ప్రత్యేక దొడ్డిలో ఉంచి భోజనానికి వెళ్లాడు. తిరిగి వచ్చేలోపు వీధి కుక్కలు దాడి చేయడంతో 10 గొర్రె పిల్లలు మృతి చెందాయి. మరో 15 తీవ్రంగా గాయ పడ్డాయి. సమాచారం అందుకున్న పళవల్లి పశు వైద్యాధికారి రామాంజనేయులు అక్కడకు చేరుకుని గొర్రె పిల్లల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించి, నివేదికను సిద్ధం చేశారు.

క్లుప్తంగా

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న జనసేన కుటుంబాలు

పుట్టపర్తి రూరల్: బుక్కపట్నం మండలానికి చెందిన 18 జనసే కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే దుద్దుకంట శ్రీధర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో లక్ష్మణ్, గణేష్, శ్యాము, మసూద్, బాబావలి, జిక్రియ, బాలకృష్ణ, మహమ్మద్ అలీ తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హిందూపురం అర్బన్: పట్టణంలోని రహమత్‌పూర్ సమీపంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద ఉన్న చెత్తలో ఎవరో బీడీ, సిగరేట్ తాగి వేయడంతో ఆదివారం మధ్యాహ్నం చెత్త అంటుకుంది. మంటలు అక్కడే ఉన్న అంగన్వాడీ కేంద్రం గదిలోకి వ్యాపించాయి. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ రూ.5 వేల వరకు నష్టం జరిగిందన్నారు.

అగ్నికి ఆహుతైన మామిడి, టేకు చెట్లు

- రూ.2 లక్షల నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం

పావగడ: తాలూకాలోని బళ్లారి ప్రధాన రహదారిలోని వీరమ్మనహళ్లి గేటు సమీపంలో ఉన్న మామిడి తోట వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అయితే ఆదివారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరడంతో మంటలు మామిడి, టేకు చెట్లకు వ్యాపించాయి. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే రైతు రవిప్రసాద్ స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సకాలంలో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో భారీ నష్టం తప్పింది. బాధిత రైతు రవిప్రసాద్ మాట్లాడుతూ రెండెకరాల పొలంలో మామిడి, టేకు చెట్లు పెట్టుకున్నానని, పంట చేతి కొస్తున్న సమయంలో మామిడి చెట్లు దగ్ధమై సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశాడు.


ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులు



ఓటేస్తున్న వృద్ధురాలు

హిందూపురం టౌన్: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆదివారం తొలి ఓటు పడింది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హోం ఓటింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆదివారం హిందూపురం నియోజకవర్గానికి చెందిన 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హిందూపురం నియోజకవర్గం నుంచి మొత్తం 73 మంది హోం ఓటింగ్‌కు ఆమోదం తెలిపారు. వీరిలో ఆదివారం 71 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, ఇద్దరు మృతి చెందినట్లుగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



అపస్మారకస్థితిలో ఉన్న నాగరాజు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో హిందూపురానికి చెందిన నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న నాగరాజు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన నాగరాజును హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్



పార్టీలో చేరుతున్న వారికి కండువాలు వేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి నివాసంలో పార్టీ కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కూటమి ప్రకటించిన అబద్ధపు హామీలను ప్రజలకు వివరించాలన్నారు. బూత్ కమిటీ సభ్యులు వారం రోజుల పాటు ప్రతి ఓటరునూ కలిసి మద్దతు కోరాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ కంబాలప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, నరసింహమూర్తి, శ్రీనివాసులు, ఇమామ్‌వలి, కళ్యాణ్, జగదీష్, ఈశ్వర్‌రెడ్డి, అంజి, నాగరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లికి చెందిన పది కుటుంబాలు టీడీపీని వీడి మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికీ మంత్రి ఉషశ్రీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధి, సంక్షేమానికే తాము మద్దతు తెలుపుతున్నట్లు పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు.

శ్రీధరన్న విజయం తథ్యం



అప్పలవాండ్లపల్లి తండాలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొత్తచెరువు: పుట్టపర్తి ఎమ్మెల్యేగా మరోసారి శ్రీధర్‌రెడ్డి విజయం తథ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం అప్పలవాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్టీ సెల్ జోనల్ ఇంచార్జ్ డుంగావత్ రమేష్‌నాయక్ ఇంటింటా ప్రచారం చేపట్టారు. 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గీతారుప్లానాయక్, నాయకులు రమణారెడ్డి,మున్వర్‌బాషా, వేమూరి సూరి, గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం



అమడగూరులో ప్రచారం చేస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

అమడగూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ రాజ్యం సాధమ్యని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన అమడగూరు, ఏ కొత్తపల్లి, పుట్లవాండ్లపల్లి, దిన్నమీదపల్లి, పేరంవాండ్లపల్లిలో జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 2019లో మాదిరిగా ఈ సారి ఎన్నికల్లో కూడా ఫ్యానుగుర్తుకు ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలన్నారు. అమడగూరు మండల వ్యాప్తంగా సుమారు 40 గ్రామాలకు అనుసంధానంగా తారు, సీసీరోడ్లు నిర్మించామన్నారు. ఎన్నడూ లేనివిధంగా సుమారు 3 వేల మందికి ఇంటి పట్టాలతో పాటుగా జగనన్న ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఈవీఎం పై సీరియల్ నంబరు 3 మీద ఉన్న ఫ్యానుగుర్తుకు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ఓటేయాలని కోరారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కవిత శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, రాష్ట్ర మహిళా కార్యదర్శి భారతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు పొట్టా పురుషోత్తమరెడ్డి, ఉమాదేవి, టౌన్ కన్వీనర్ సుధాకర్‌రాజు, హరినాథరెడ్డి, సర్పంచ్ షబ్బీర్, ఎంపీటీసీ పెద్దప్పయ్య, ఖాజాపీర్, దొడ్డెప్ప, గోపీనాథ్, నవీన్, యస్‌పాల్, రామాంజులు, నరసింహులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలే కీలకం



బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న చరణ్‌రెడ్డి

రొద్దం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ గెలుపు కోసం అందరూ కలసినట్లుగా పనిచేయాలని మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఆయన పర్యటించారు. బూత్ కమిటీల సభ్యులతో సమావేశమాయ్యారు. శ్రీచరణ్ మాట్లాడుతూ ప్రతి బూత్ కమిటీ సభ్యులు కీలకంగా ఉండాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు అక్కులప్ప, ఎస్ నారాయణరెడ్డి, నరసింహులు, వినయ్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రాజారెడ్డి, మారుతిరెడ్డి, సి.నారాయణరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని, మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని దుద్దేబండ పంచాయతీలోని గొందిపల్లి, చంద్రగిరి, గొల్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రతి గడపకూ తిరగుతు ఫ్యాను గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాశ్‌రెడ్డి, సర్పంచ్ గౌతమి, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, కర్రా సంజీవరెడ్డి, పోతిరెడ్డి, రాము, చిట్రా మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటేస్తేనే సంక్షేమ పథకాలు



ప్రచారంలో పాల్గొన్న నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని మంత్రి ఉషశ్రీచరణ్ సోదరి జ్యోత్స్న ప్రజలకు వివరించారు. పెనుకొండ పట్టణంలోని జగనన్న కాలనీ, ఎన్టీఆర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఆమె వైఎస్ఆర్‌సీపీ నాయకులతో కలసి ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సోదరి ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతోందన్నారు. అలాంటి మహా నాయకుడికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, బోయ శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొద్దని, ఆయన విడుదల చేసిన మేనిఫెస్టో బూటకమన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యులు గురురాజ్, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, రఘునాథరెడ్డి, భాస్కర్‌నాయక్, తయూబ్, శేషాద్రి, రామాంజినేయులు, సచివాలయ కన్వీనర్ రాము, కోఆప్షన్ మెంబర్లు ముహీబా, నేమతుల్లా, ముఖ్యనాయకులు జయశంకరరెడ్డి, కొండలరాయుడు, వెంకటేసులు, గణేష్, శంకరరెడ్డి, నాయుడు, గోపాల్, బోయబాబు, ఫరీద్, యాసిన్, షామీర్, షేక్షావలి, ఇస్మాయిల్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల దగ్ధం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల సమీపంలో రైతు హరికృష్ణ వ్యవసాయ పొలంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగటంతో వ్యవసాయ పరికరాలు కాలిపోయాయి. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గుర్తు తెలియని వ్యక్తులు పశుగ్రాసానికి నిప్పు పెట్టడంతో రైతు హరికృష్ణ పొలానికి వ్యాపించాయి. విషయం తెలుసుకున్న రైతు హుటాహుటిన పొలానికి చేరుకున్నాడు. అప్పటికే 65 స్ప్రింక్లర్ పైపులు, స్టాటర్, 30 మీటర్ల కేబుల్ కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

ప్రత్యర్థులెవరైనా గెలుపు నాదే



చిత్రావతి గుట్టలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- పుట్టపర్తిలో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రచారం

పుట్టపర్తి టౌన్: ప్రత్యర్థులెవరైనా గెలుపు తనదేనని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 7,8 వార్డులలో ప్రచారం నిర్వహించారు. భారీగా జనాలు తరలిరావడంతో పట్టణవీధులు జగన్నినాదంతో మార్మోగాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని అభ్యర్థించారు. అర్హులందరికీ జగనన్న ప్రభుత్వంలో పూర్తిగా న్యాయం జరిగిందన్నారు. కుల,మతాలు, రాజకీయాలకు అతీతంగా, పైసా లంచం లేకుండా ప్రజల ఇళ్ల వద్దే పథకాలు అందించామన్నారు.

ఓటమిని గుర్తించే కోడలు బరిలోకి..

మాజీ ఎమ్మెల్యే రఘునాథరెడ్డి తన ఓటమిని ముందే గుర్తించి తాను బరిలోకి దిగకుండా తన కోడలు సింధూరను బరిలో దింపారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల బకాయిలను చెల్లించిన తర్వాతే చంద్రబాబు, పల్లె ప్రజలను ఓట్లడగాలన్నారు. చంద్రబాబు, పల్లె ప్రతి ఇంటికీ రూ.6 నుంచి రూ.8 లక్షలు అప్పుపడ్డారన్నారు. పదేళ్ల పాటు మంత్రిగా ఎమ్మెల్యేగా ఉన్న పల్లె రఘునాథరెడ్డి ప్రజలు చెప్పుకొనే మంచి పని ఒక్కటైనా చేశారా అని ప్రశ్నించారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారన్నారు. ఆంధ్రాలోకి కేంద్రమంత్రి అమిత్ షా లాంటి వారు ఎందరొచ్చినా జగన్ ప్రభంజనాన్ని అపలేరన్నారు. అభివృద్ధి , సంక్షేమం అజెండగా ముందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీని గెలిపించుకొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

9న ఖాద్రీ ఆలయంలో బహిరంగవేలం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏడాది పాటు తలనీలాల సేకరణ హక్కు కోసం ఈనెల 9న బహిరంగ వేలం, ఇ-టెండర్, సీల్డ్ టెండర్ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరావత్తు రూ.30 లక్షలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. అన్నదానానికి ఏడాది పాటు కూరగాయల సరఫరా, శ్రీవారి యంత్రం సరఫరాకు ధరావత్తు రూ.10 వేలు చెల్లించాలన్నారు. ఉమామహేశ్వర స్వామి(శివాలయం)లో వివాహాలకు వాయిద్యములు వాయించుటకు ఏడాది పాటు హక్కు కోసం ధరావత్తు రూ.50 వేలు, ఆలయ భూములకు మూడేళ్లపాటు పంట సాగు హక్కు కోసం రూ.2 వేలు చెల్లించి వేలం పాల్గొనవచ్చిన తెలిపారు. వేలం అనంతరం నగదు మొత్తం చెల్లించాలన్నారు. వివరాలకు 9000490670 నంబరులో సంప్రదించాలని సూచించారు.

శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించండి



బాసంవారిపల్లిలో ప్రచారం చేస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

నల్లమాడ: మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పుట్టపర్తి ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి కోరారు. నల్లమాడ పంచాయతీలోని బాసంవారిపల్లి, ఎన్. బడవాండ్లపల్లి గ్రామాల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్ చూపుతూ మూడో నంబరులోని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని సూచించారు. దుద్దుకుంట అపర్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి, పెద్ద తిరుపాల్‌రెడ్డి, రైతు సంఘం మాధవరెడ్డి, గోవిందరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, చిన్న తిరుపాల్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, ఉత్తప్ప, రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, పెద్ద శ్రీనివాసులు, లక్ష్మీపతి, రాధమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



గోరంట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వెంకటాపురం తండాలో ప్రచారం చేస్తున్న నాయకులు



ఆల్విన్ కాలనీలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నందిని , నాయకులు



సోమందేపల్లి: ప్రచారం చేస్తున్న నాయకులు



హొన్నంపల్లిలో ప్రచారంలో పాల్గొన్న సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి

గోరంట్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రుపొందించిన ఎన్నికల మేనిఫెస్టోతో పేదలకు కలిగే ప్రయోజలను వివరించి, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

పెనుకొండ: పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ నందిని, కౌన్సిలర్ రఘునాథరెడ్డి, తయూబ్, ముఖ్య నాయకులు జయశంకరరెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారం చేశారు. పట్టణంలోని ఆల్విన్ కాలనీలో, కమాన్ వీధిలో, జీఐసీ కాలనీల్లో విడివిడిగా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే , ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మలను గెలిపించాలని కోరారు.

వెంకటాపురంలో తండాలో...

జగనన్నకు గిరిజనులు తోడుగా నిలవాలని పెనుకొండ నగర పంచాయతీ కౌన్సిలర్ బోయ హారతి, ఆమె భర్త బోయబాబు గిరిజనులను కోరారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటాపురం తండాతో పాటు పరమేశ్వరపురంలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్ ద్వారా ఫ్యాన్ గుర్తుకు ఎలా ఓటు వేయాలో ఓటర్లకు అవగాహన కల్పించారు. నాయకులు చందానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండల కేంద్రంతో పాటు కొడిగెనహళ్లి, మోదా, శాసనకోట, శిరేకోళం, హొన్నంపల్లి, ఊటుకూరు. నరపాపురం తదితర పంచాయతీ గ్రామాల పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఉషశ్రీచరణ్, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న శాంతమ్మ గెలుపు కోసం ఫ్యాను గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

సోమందేపల్లి: ఎన్నికల సమయంలో టీడీపీ ప్రకటించిన అబద్ధపు హామీలను ప్రజలు నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఆదివారం మండలంలోని నడింపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌కు ఓటు వేసి గెలిపించాలని తద్వారా మళ్లీ సంక్షేమ పాలన వస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలేపల్లి నర్సింహులు, నాగరాజు, మురళి, మంజు, బాబు, ప్రసాద్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

బాలయ్యకు ఓటమి భయం !



హిందూపురంలో శనివారం జరిగిన సీఎం వైఎస్ జగన్ ప్రచార సభకు వేలాదిగా తరలివచ్చిన జనం

- హిందూపురంలో సీఎం జగన్ సభ గ్రాండ్ సక్సెస్
- నూతనోత్సాహంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- దిక్కుతోచనిస్థితిలో తెలుగు తమ్ముళ్లు
- మళ్లీ సర్వేలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ !

హిందూపురం అర్బన్: హిందూపురంలో శనివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ గ్రాండ్ సక్సెస్ అయింది. మండు టెండలోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో అంబేడ్కర్ సర్కిల్ ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. పురం వీధులన్నీ జగన్నినాదంతో మార్మోగడంతో టీడీపీకి ఓటమి భయం పట్టుకుంది. టీడీపీ నాయకులు ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా హిందూపురంలో ఏదో జరుగుతోందని ఎమ్మెల్యే బాలకృష్ణ అనుకుంటున్నారట. అందుకే వెంటనే కొందరు తమ్ముళ్లను పురమాయించి వెంటనే సర్వే చేయించుకుంటున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే బాలకృష్ణతో పాటు ఆయన సతీమణి వసుంధర, కుమార్తెలు ప్రచారం చేస్తున్నా పెద్దగా స్పందన రావడం లేదని మదన పడుతున్నారని అంటున్నారు.

వైఎస్సార్‌సీపీకే జై కొడుతున్న జనం

సీఎం వైఎస్ జగన్ సభకు మహిళలు, మైనార్టీలు, క్రైస్తవులు పెద్ద ఎత్తున జన నీరాజనాలు పలకడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈసారి బాలయ్యకు ఓటమి తప్పదన్న సంకేతాలతో తాయిలాలతో ఇతర పార్టీల్లోని ముఖ్యనాయకులను తమ వైపు తిప్పుకునేందుకు యత్నిస్తున్నారన్న విమర్శలున్నాయి. వార్డు మెంబర్ మొదలు ఎంపీటీసీ, సర్పంచ్, జెడ్పీటీసీలకు పెద్ద మొత్తంలో ముట్టచెబుతూ తమ వైపునకు లాక్కొంటున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఓటర్లు మాత్రం వైఎస్సార్‌సీపీకే జై కొడుతుండటం టీడీపీ శ్రేణులకు మింగుడు పడటం లేదంటున్నారు. లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో చేసేది లేక ఒక్కొక్కరికి రూ.500 ఇచ్చి ప్రచారాలకు తీసుకెళ్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆయా మండలాల్లో వారిని ఏర్పాటు చేసేందుకే కొంత మంది టీమ్‌లుగా ఏర్పడినట్లు చెబుతున్నారు.

ఓటర్లను ఆకర్షించేందుకు ఎత్తులు

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా టీఎన్.దీపిక, శాంతమ్మ జోరుగా ప్రచారం చేస్తున్నారు. హిందూపురం పట్టణంలో 1.29 లక్షలు ఓటర్లు ఉండగా రూరల్, లేపాక్షి చిలమత్తూరు మండలాల్లో 1.20 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఏ కులం ఓటర్లు ఎంత మంది ఉన్నారు? వారిలో ఎవరు ఏ పార్టీ మద్దతుగా నిలిచే అవకాశం ఉంది? ఓటర్లను ఆకర్షించేందుకు తక్షణంగా ఏం చేయాలన్న చర్చ టీడీపీలో సాగుతోందని చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హిందూపురంలో నిర్వహించిన ప్రచార సభ విజయవంతంకావడంతో ఆ పార్టీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. సోమవారం నుంచి పెద్ద ఎత్తున ఎక్కడికక్కడ ప్రచారాలకు శ్రీకారం చుట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. 'పురం' కోటపై ఈసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.